మెట్లు

ఆ మాలపిల్ల తెల్లబోయి చూచింది, తమ గూడెం బయట ఆగిన
కారులోంచి దిగిన ముగ్గురు బాలికలనూ, ఒక యువకుణ్ణీ ! ఎంత చిత్రమైన
బట్టలు కట్టుకున్నారు. ఎంత తెల్లగా ఉన్నారు. వాళ్ళు కారులోంచి దిగగానే
ఏదో గుమ్మైన వాసన ఆ చుట్టుపక్కలంతా ప్రసరించింది !

ఈలా అనుకుని ఆ పదునాలుగేళ్ళ ఈడుగల బాలిక తనవైపు
చూచుకుంది. ఉతుకు ఎరగని చెరిగిపోయిన తన పాత పోగులు పరిశీలించు
కొంది. ఆ చిరుగుపాతే చీరలా వల్లె వేసుకుంది. అప్పుడప్పుడు తానూ
తలగడుగు పోసుకుంటుంది. అయినా తన వాళ్ళు అలా గుమ్మన వాసనే
స్తుందా.

ఆ దిగిన బాలికల బంగారపు ఒడలి కాంతులు చూచింది. తనదేహం
కారునలుపు! పళ్ళు మాత్రం తెలుపు. ఆ బాలికలు జుట్టు ఎంత అందంగా
దువ్వుకొన్నారో ! ఆ పూలో ! ఆలాటి పూలే పూయవు తమ
గూడెంలో.

వాళ్ళు వేసుకొన్న బంగారుహారం, చెవులకు పెట్టుకొన్న ఆ లోలా
కులు, చేతుల ఆ సన్నని బంగారు గాజులు, అమ్మో, వాళ్ళు తొడుగుకొన్న
ఆ చెప్పులేమిటి? కిరస్తానీమిసమ్మ తొడుక్కునే జోళ్ళకన్న ఎంత అందంగా
ఉన్నాయో!

వాళ్లు కారెక్కివచ్చారు. అప్పుడప్పుడు దున్నపోతు స్వారి తప్ప తన
కేముంది. వాళ్ళు ఎంత తియ్యగా మాటాడు కొంటున్నారు? మధ్య మిసమ్మ
మాట్లాడే ఇంగిలీషూ మాటాడుతున్నారు.

తనతల సంతనాడు తప్ప నూనేమెరుగును. తంగేడు పూలు, పొలం
గట్టున బంతిపూలుతప్ప తాను పూలేమెరుగును. శివరాత్రి తీర్థంరోజున తాను
గడ్డికోసి బజారులో జట్కావాళ్ళ కమ్మితే వచ్చిన డబ్బులో అప్పుడప్పు
డయ్యకియ్యకుండా దాచుకొన్న అణా, అర్ధణా, కాసీలు పోగుచేసుకొన్న

పదహాల మూడుకానులతో కొన్న మాయ వెండి కడియాలు, ముగులేగా తనకు!

ఆ బాలికకు యౌవనం తొంగిచూస్తున్నది. పదునాలుగేళ్ళయినా కాయ కష్టంచేసే జాతి కాబట్టి త్వరగా ఈడురాదు. యౌవనం పొంగి పొర్లే ఆ ముగ్గురు నాగరక బాలికలకు కనుముక్కు తీరు లెట్లా ఉన్నా వయ్యారం దేహమసృణత్వము బంగారురంగు ఆ ప్రదేశం అంతా కాంతించాయి.

ఈ మాలపిల్ల మాచి మోముురేఖలు శిల్ప సౌందర్యాలు, విశాల నయనాలు సినీమా తారలు చూచి ఉడుకుబోతు తనంతో కుంగి పోవల సినదే.

ఈనాడు మాలమాచి ఆ అందాల బాలికలమాచి తెలియరాని ఆవేద నలో కుంగిపోయి కన్నులనీరు తుడుచుకుంది.

ఆ రాత్రి మాచికి నిదరలేదు. మాచికి పోతిగాడిసంబంధం కుదిర్చాడు తండ్రి. పోతిగాడు దున్నపోతులా ఉంటాడు. పోతిగాడు తనకు వద్దు. యీ మాలగూడెం తనకువద్దు! చదువు. ఆ పిల్లలులా అవ్వాలి. అలా కారు ఎక్కాలి. అలాంటి నగలు, అలాంటి చీరెలు, ఆలా! అలా!

2

మాచెమ్మ స్కూలు ఫైనలు పరీక్షలో నెగ్గింది; తనఊరు వచ్చింది.

"బాబూ! యీ వూరులో ఉండలేను" అంది. ఎంతమంది బతిమాలినా ఉండనంది. ఇరవదవ ఏడున ఖద్దరు చీరా, ఖద్దరు రయికా తొడుక్కొని హరిజనసుందరి మాచెమ్మ సంపూర్ణ యవ్వనంతో మాలపల్లి చివర కరణం గారి మామిడితోటలోని పూతపూచిన గున్నమామిడిలా ఉన్నది. కాకతీసీప కాలోత్పల విగ్రహంలా ఆమె వికసించింది.

ఆమె ఎంత చదువుకున్నా రంగేమి మారుతుంది ? ఎంత చక్కని చీరలు కట్టుకున్నా నల్లరంగును బంగారం చేయలేవు, రహస్యంగా ఇంగ్లీషు మాసపత్రికలు కొనుక్కొంటూ, అందు ఆంగ్ల అమెరికను స్త్రీలు అందాలు

ఏలా సేకరించుకుంటారో చదివేది.

ఇంటిదగ్గిర పోరుపెట్టి తనగ్రామపు హరిజనసంఘంవారి సహాయంతో చెన్నపట్నం దుర్గాబాయమ్మగారి ఆంధ్ర మహిళాసభ విద్యాలయంలో ఎనిమిదేళ్ళుచదివి, మొదటితరగతిలో కాశీ విశ్వవిద్యాలయ ప్రవేశపరీక్షలో కృతార్థురాలైంది.

ఉచిత విద్యావేతనం సంపాదించింది, ఇంటరు చదవడానికి.

చదివే రోజుల్లో రెండు మూడు సంబంధాలు తండ్రి తీసుకొని వచ్చాడు. ఒక హరిజన బాలుడు ఇంటరులో నెగ్గినాడు. తాలూకాఫీసులో గుమాస్తా ఉద్యోగానికి, ప్రభుత్వపు ఉద్యోగాల సమితివారు ఎన్నుకొన్నారు. మాచమ్మ ససేమిరా నేను పెళ్ళిచేసుకోనంది.

ఆరోజు సాయంకాలం తన ఊరుబయట కనబడిన కారు, కారునుంచి దిగివచ్చిన అప్సరసలు, ఆ వయసుకాడు, వారి కిలకిల సంభాషణలు, ఆ ఏడుచుల వయ్యారినడకలు, వారిచీరలు, వారి నగలు, వారి దేహపు మిసిమితనం, ఆహా—ఆమె గజగజ వణికింది.

చిన్న బాలికగా స్నానం అంటే అసహ్యించుకొనేది. దుర్వాసన కొట్టే తాను చుట్టబెట్టుకొన్న పాత పేలిక తడపడం అంటే ఆమెకు రోషం వచ్చేది. సంతలో తెచ్చుకొన్న నూనె రాసుకోవడమూ అసహ్యమే!

అలాంటి బాలికకు ఆ మోటారుకారు ఆ మూవురు బాలికలు ప్రథమ సోపానపంక్తి అయ్యారు.

ఆమెలో ఏమి స్పందించినదో! అదివరదాకా ఉన్న గూడెం మండిపోయింది. ఆమె చూపులో — ఆ పొలాలు నేలలోకి కుంగిపోయాయి. కాల్చిన పందిమాంసం ఎండుచేపలు రొయ్యలు కాలకూట విషాలై గంజి విషధార అయ్యింది.

మూడురోజులూ మాలగూడెంలో యమయాతన సలిపి, నాల్గవ రోజున మదరాసు వెళ్ళిపోయింది.

3

మాచమాంబ అని పేరు మార్చుకున్నది. ఇంటరు పరీక్ష ప్రథమతరగతిలో నెగ్గి విద్యార్థి వేతనంతో వైద్యకళాశాలలో చేరింది.

అందరితోనూ మాట్లాడేదికాదు మాచమాంబ. చదువుకొన్న కళాశాలలో అతి జమీందారికంగా మెలిగింది. ఎవ్వరీ బాలిక, ఎవ్వరీ మాచమాంబిక అని ఇంటరు విద్యార్థులు విద్యార్థినులు కళ్ళతో ప్రశ్నిస్తే, తాను మాలపిల్లనని చెప్పుకోలేకపోయింది. మంచి టాల్కం చూర్ణం, పలచని పెదవులరంగు, చక్కని సెంట్లు,పాముకుబుసములాంటి చీరలూ అవి కొనేందుకు వచ్చిన విద్యార్థి వేతనం చాలకపోకే, తిండి తక్కువ తిని అవన్నీ సంపాదించుకొన్నది.

వార్ధాఆశ్రమం వెళ్ళినప్పుడు హరిజన బాలిక అవడంవల్ల మహాత్ముని ఆశీర్వాదాలు, ఇతర నాయకుల అభినందనాలు పొంది, కొంత వేతనం సముపార్జించుకొని మదరాసు వచ్చింది. అక్కడ స్త్రీల వేషభాషాదులలోని నిరాడంబరత, స్నిగ్ధసౌందర్యమూ చూచి, సేవాగ్రామ ఆశ్రమంలో ఉన్నంత సేపూ ఏదో బాధకు లోనయింది. కాని ఏ దర్శనమైతే ఆమెను మాలపల్లికి దూరం చేసిందో ఆ ఆశ తిరిగి మదరాసుకు రాగానే ఆమెను తన పంథానే నడిపింపజేసింది.

బాలకుల పొగడ్తలలో "ఈ చీర బాగున్నది, నీవేషం మహాద్భుతం" అన్న ముక్కలే వినేదికాని "నువ్వు సౌందర్య రాణివి" అన్నమాట ఒకనాడూ వినలేదు.

ఒక తోటి విద్యార్థి ఎప్పుడూ మాచమాంబను అనుసరించేవాడు. అతడు ఆమెతో ఎంతో స్నేహం చేశాడు. ఆమెను సినిమాలకు తీసుకువెళ్ళాడు. ఆమె దగ్గరగా చేరి రెండు మూడుసార్లు ఆమె దృఢవక్షనిధులపై హస్తతలం పోనించి స్పర్శించి, అదిమినాడు. అప్పుడా బాలికకు వివశత్వం కలిగింది. ఒళ్ళంతా విద్యుల్లతలు ప్రసరించాయి. కాని ఆ బాలుడు తన్ను ప్రేమించి ఆలా చేయలేదనీ తన్ను క్షుద్రజాతి బాలికగా ఎంచి క్షుద్రజాతివానికి

నీతి నియమా లుండవని యెంచి, వాడు ఈలా తన్ను అవమానం చేశాడనే భావం కలిగిం దామెకు.

ఆమె అవమానంతో కుంగిపోయింది. తోకతొక్కిన భుజంగిలా బుస్సుమన్నది. మరునా డా బాలుడు సంతోషంతో పల్కరించగానే వానితో "ఓరి దుర్మార్గుడా, నేను హీనజాతిదాననుకదా, నీ పశుత్వానికి అడ్డంపెట్టనను కున్నావా? ఇక్కడనుంచి నాతో మాట్లాడకు, నువ్వు విషపు జంతువవు !" అని మండిపోయింది. ఆ యువకుడు తెల్లబోయి తలవాల్చుకుని వెళ్ళిపోయి నాడు.

ఆమె ఆనాటినుంచి తన తరగతిలో బాలకులతోగాని, తన కాలేజీ లోని యితర తరగతుల యువకులతో గాని మాటలాడటం మాని వేసింది.

ఒకనాడు మాచమాంబిక ఒక ఆచార్యుని ఇంటికి వెళ్ళింది. అప్పు డప్పుడు తెలియని విషయాలు చెప్పించుకొనడానికి విద్యార్థులు, విద్యార్థు లు తమకు వివిధ పాఠాలు చెప్పే వివిధ ఆచార్యుల ఇళ్ళకు వెళ్ళే అలవాటు ఉంది.

ఆ అలవాటు చొప్పున మాచమాంబ తానున్న బాలికా వసతిగృహం నుంచే బయలుదేరి తమ తరగతికి ఆచార్యులలో ఒకరి బసకు ఏదో పాఠం చెప్పించుకోడానికి వెళ్ళింది. ఆమె చదువుదీక్ష ఆ ఆచార్యులకు తెలుసును. ఆమె గ్రహణశక్తి తక్కువే. కాని, అది తెలుసుకొన్నంతవరకు నిద్రాహా రాలు మానివేస్తుంది. తెలుసుకొని కాని ముందుకు అడుగులేయదు.

ఆ ఆచార్యులు మధ్యవయస్సు కలవాడు. ఆమె సౌందర్యం ఆతన్ని ఆకర్షించలేదు. ఆమె యవ్వనం, ఆమెదీక్ష, ఆమె దేహపుజిగి ఆతని హృద యాన్ని కలతపెట్టాయి. ఈ బాలిక ఎవరో పేదవారిబిడ్డ. కొంచెం అనున యిస్తే తన కోర్కెను ఎందు కామె తీర్చరాదు?

ఆ రాత్రి ఎనిమిది గంటలకు పాఠం ఆ ఆచార్యులు ఆమెను తన ప్రక్కనే సోఫాపై కూర్చుండపెట్టుకొని బోధిస్తున్నాడు. ఏ యూహాలాపంగా

వేసినట్లో తనచేయి ఆమెతొడపై వేసినాడు. ఆమె పాఠం చదివే దీక్షలో ఆ చేయి నంతగా గమనించలేదు. ఆ చేయి—ఆ చేయి నెమ్మదిగా ఆమె బొడ్డు క్రిందకు జరిగింది. ఆమెకు ఒక్కసారిగా మెలకువ వచ్చింది. ఆమె గభుక్కున ఆతనిచేయి తీసిపారవేసి, లేచి, ఆడుపులై "మీకు బుద్ధి ఉందా, ఇదా మీరు పాఠం చెప్పడం!" అని ఆ పుస్తకాలన్నీ అక్కడేఉంచి విస విస గది విడిచి వెళ్ళిపోయింది.

తన సొమ్ముసంచీ మొదలైనవి ఉంచుకొన్న అలంకరణపు సంచీ అక్కడే ఉండిపోయినందున తిన్నగా నడిచే తన వసతి గృహం చేరింది.

అందరు ఆచార్యులు అందరు విద్యార్థినులలా అలాగే చేస్తారా ? లేక తనకొక్కర్తికే ఈ పరాభవమా? ఆమె కుంగిపోయింది. ఆ మరునాడు ఉదయం ఆ ఆచార్యులు ఆమె గ్రంథాలు, సంచీ అన్నీ పంపిస్తూ ఆ అలంకరణపు సంచిలో ఒక లేక ఉంచాడు.

"అమ్మాయీ, క్షమించు! ఇది నా అపచారం కాదు! నేను ఒంటివాడను. భార్యపోయిన మధ్యకాలపువాణ్ని. వైద్యాలయంలో దాదులు నా కో విధమైన తృప్తి తీరుస్తున్నారు కాని సరియైన మందుకూ, ప్రకటనపు మాయ మందుకు నాకు తేడా తెలిసిందికాదు. రాత్రంతా నిదరపట్టలేదు. నేను పడిన బాధ అనంతము! కంచె చేనుమేస్తే లోకం నాశనమే! నేను నలభై ఒక్క ఏళ్ళవాడిని నాకు భార్యలేదు. ఇద్దరు బిడ్డలు. ఇద్దరూ మేనమామలకడ బెంగుళూరులో చదువుకొంటున్నారు. నిన్ను గురించి విచారిస్తే నువ్వు హరిజన బాలికవనీ చెక్కు చెదరని శీలం కలదానివనీ తెలుసుకున్నాను. నువ్వు నన్ను వివాహం చేసుకో — నేను తెలుగు బ్రాహ్మణుణ్ని! నువ్వు నన్ను ప్రేమింపలేకపోవచ్చును. కాని ఉత్తమ గృహిణీ ధర్మమే ప్రేమకాగలదని నా నమ్మకము. నీకు ఇష్టముంటే నీకున్న కుంకుమ పువ్వురంగు చీర కట్టుకొనిరా! లేకపోతే ఏచీర కట్టుకున్నా సరే! ఆలోచిస్తాను అనదలుచుకుంటే పువ్వులులేని తెల్లచీర కట్టుకురా! ఇట్లు క్షంతవ్యుడైనరావు" అని ఆతడు ఉత్తరం వ్రాశాడు. ఆయనపేరు డాక్టరు సి. పి. రావు.

4

మాచమాంబిక ప్రభుత్వవైద్యశాలలో వైద్యురాలయినది. భర్త డాక్టరురావుగారు నెల్లూరులోనే జిల్లాముఖ్యవైద్యాధికారి అయినాడు. మాచమాంబపేరు డాక్టరు మాచమాంబారావు. ఆమె అసిస్టంటు సర్జనుగా ఉన్నది. ఆమెకు ఆమె కాలేజీ విద్యార్థినిగా ఉన్నప్పుడే వివాహం అయింది.

డాక్టరురావు గురువుల వివాహ ఉత్తరం పదేపదే చదువుకొని మాచమాంబ ఆలోచించుకొన్నది. ఉత్తరము వచ్చిన మూడురోజులవరకు ఆమె కదే ఆలోచన. తాను హిందూ జాతికాలికింద నలపబడుతూ ఉన్న మాల పిల్ల. డాక్టరురావుగారు బ్రాహ్మణుడు. పెద్దవాడయితే ఏమి. పదమూడు పన్నెండు సంవత్సరాలతేడా పెద్దతేడా కాదు. తనతోటి యువకులు తన్ను వివాహం చేసుకుంటారా? ఆరేడువందల జీతము. కారు కలిగిఉన్న భర్త-తన చదువుపూర్తి—తనకు కావలసిన చీరలు-నగలు కారు—తన చదువున కాయన కిరీటం కాగలడు!

ప్రేమా? తనకు ప్రేమ అంటే ఏమీ తెలియదు. డాక్టరురావు అంత అందమైన వాడుకాడు. అతన్ని తాను ప్రేమించగలదా? ప్రేమ అనేది జంతు ధర్మానికి మానవ మనస్తత్వం రంగరించిన ఒక మందు తాను ప్రేమించ గలుగునోలేదో ! ఏదైనా అయన్ను వివాహం ఆడడంవల్ల తనకు అన్నీ లాభాలే !

ఏకారణంవల్లనయితేఏమి ఆ ఉత్తముడు తన్ను వివాహంచేసుకుంటా నన్నాడు.

ఆమె మూడవనాడు కుసుంబాచీర కట్టుకు వెళ్ళింది. అందాకా వట్టి తెల్లచీర కట్టుకొని వెళ్ళేది. ఆ మరునాడు సాయంకాలం ఆమె పుస్తకాలు పట్టుకొని డాక్టరురావుగారింటికి వెళ్ళింది, వారు పెళ్ళివిషయం అన్నీమాట్లాడు కున్నారు.

పెళ్ళి రిజష్టరూ అయింది, హిందూ వివాహం చొప్పునా అయింది. వైద్యకళాశాలాచార్యులు, వైద్యాధికారులు మొదలైన వారెం

దరో వచ్చినారు. కాని ఆమె తన తల్లిదండ్రులనూ, చుట్టాలను ఎవ్వరినీ రావద్దంది.

భర్త తనకు ఈనాడు అన్ని సౌకర్యాలు పొందడానికి కారణం అయ్యాడు. కావలసినవి ముద్దినిసు ముక్కాలు చీరలూ ఉన్నాయి. చక్కని అతినవీనరకపు నగలు, అందమైన కారు, జిల్లా వైద్యాధికారి బంగాళా. ఇంగ్లీషు క్లబ్బు. అనుకున్నవి జరుగుతున్నాయి. కాని! కాని !

భర్తకు మొగం అందం కాకపోయినా ఇరవయ్యేళ్ళ బంగారు ఛాయ తాను గర్భవతి కావచ్చు. పురిటికి సెలవు పుచ్చుకొంటుంది. తనపై అధికారైన భర్త పురుడుపోయగలరని ఆమె కలలుగన్నది.

ఆమెకు కామతృప్తి, భర్తకు కామతృప్తి అవుతున్నది. భర్త ఒక విధంగా రసికుడే. తనకేమి తెలియును రసికత! అందుకై ఎన్నో స్త్రీ పురుష సంబంధ గ్రంథాలు చదివినది. కష్టపడే విద్యార్థినిగా తయారయింది. యీ విషయంలో కష్టపడే విద్యార్థినే.

వారి వివాహం అయి మూడేళ్ళు నడిచింది. కాని వారిద్దరిలో యేదో అసంతృప్తి ఉన్నదని ఆమె గ్రహించేది. ఆమె యవ్వనంచూచి ఉద్భవించిన వాతావరణం చూడక, తొందరపడి ఆ బాలికను చేసుకొన్నాడు. తరగతి నల్ల కుక్కను తెల్లకుక్కను చేసే ప్రయత్నం అయింది. మంగలి బ్రాహ్మణుడెట్లా అవుతాడు? అనాగరకజాతి స్త్రీ ఎంత చదువుకుంటే ఉత్తమ సంస్కారుని భార్య కాగలదు? అతని మొదటిభార్య జ్ఞాపకం వచ్చింది. బిడ్డలను అప్పు డప్పుడు బెంగుళూరువెళ్ళి చూచి వచ్చేవాడు.

భార్య తన కౌగిలింతకు వచ్చిన మొదటి సంవత్సరం అతడు కామ తృప్తినందేవాడు. తరువాత అతడు ఆమెలో యేదో లోటును గుర్తింపసాగి నాడు. ఆమె తన దేహం అతనికి అర్పించేది. కాని ఆమె ఎక్కడో ఉండేది! ఆమెలేని ఆమె-దేహమాత్రమూర్తిగా తోచి అతడు వ్యథనొంది భార్యను తన పడకగదికి పిలిచేవాడుకాదు.

ఆమె బాధపడేది. అతడు వట్టి పురుషుడుగా తన్ను కోరేవాడు.

తాను పూర్ణపురుషుని వాంఛించింది. అతడు పశువులా వచ్చి పశు తృప్తి పొంది తన్ను తన పడకగదికి పొమ్మనేవాడు.

5

ఒకనాడు లేడీ ఆస్పత్రిలో లేడీ అసిష్టంటు సర్జను డాక్టరు మాచ మాంబారావుగారు ఒక స్త్రీరోగిని వైద్యాలయంలో చేర్పించవలసి వచ్చింది. ఆమె గర్భవతి. ఆ రోగికి ప్రతిపురుడు అసాధ్యమై ప్రాణాంతమువరకూ వస్తున్నది. ఆ వచ్చిన స్త్రీ ఖద్దరు ధారిణి. ఆమెకు యే రోగమూ లేదు. కాని పురుడు మాత్రమే కష్టం. ఆమె ముగ్గురు ముత్యాలలాంటి బిడ్డల తల్లి!

వారిద్దరు ఈమాటా ఆమాటా చెప్పుకొనడం ప్రారంభించారు. ఆ గర్భగుర్విణి కూడా తన భర్తకు రెండవభార్య. ఆమె తన భర్తను గూర్చి మాటకు రెండుసారులు చెప్పుకొని ఆనందించింది. ఆమె మహదానందము వైద్యురాలు మాచమాంబకు ఆశ్చర్యం కలుగజేసింది.

రోగి :— డాక్టరుగారూ, మా వారికి వచ్చుజీతం అరవై రూపాయ లయినా మా సంసారం యేదో గుప్తంగా లోట్లు లేకుండా జరుగుతున్నా దండి. ఈ యుద్ధంవల్ల ఖర్చు ఎక్కువైనమాట నిజమే కాని యుద్ధభత్యం ఇంకో పదిరూపాయలిస్తున్నారు. మాకు భూములవల్ల సాలుకు ఆరు వందలు వచ్చునవి పంటలకు ఖరీదులు ఎచ్చి ఇప్పుడు పదిహేనువందలు వస్తున్నాయి.

డా. మాచ :— ఇప్పుడు మీ సంసారం చక్కగా జరుగుతోందన్న మాటా ?

రోగి :— ఆ !

డా. మా :— ఒక వారంరోజులలో మీకు పురుడు వస్తుంది. ఇంత వరకూ ఆలస్యం చేశారేమమ్మా ?

రోగి :— నేను మావారిని ఏలా వదిలి ఉండగలను డాక్టరుగారూ.

వారు వండుకొంటారు. పిల్లలను చూసుకోగలరు. మా సవతి పోయినయేడే నా పెళ్ళి. తర్వాత మూడేళ్ళవరకూ నేను కాపురానికి రాలేదు. తాలూకాఫీసు పని—ఎన్ని తాలూకాలో బదిలీ—తామే తమకూ, తమ ఇద్దరి బిడ్డలకూ వంట చేసుకొనేవారు. ఇప్పుడు నేను వారి నెల్లా వండుకోనివ్వగలను చెప్పండీ ?

డా. మాచ:—మీకు ఇద్దరు సవితిబిడ్డలా?

రోగి:— అవునండి! నేను కాపురానికి వచ్చినప్పటినుంచి ఆ పిల్లలు "అమ్మా, అమ్మా" అంటూ నన్ను వదిలితేనా? నా బిడ్డలమీదకన్న వాళ్ళమీదే నా కెక్కువాపేక్షండి.

ఆమె పురుడు మాచమాంబారావు తానే స్వయంగా పోసింది. ఆమె భర్త, కాపురంచేసే ఇద్దరు సవితి కూతుళ్లు, ఆమె స్వంతబిడ్డలు అందరూ ఆ బాలింతాను చూడడానికి వచ్చారు. వారి ఆనందము వర్ణనాతీతము. డాక్టరు మాచమాంబారావు కన్నులనీరు తిరిగింది.

గర్భవతి అవడం ఎంత ఆనందం? గర్భవతులుగా ఉన్నప్పుడు స్త్రీలు అందవికారాలు పొందుతారు. అది అందవికారమా? అలా పాలిపోయి, లావెక్కి నీరుపట్టి కదలలేక ఆ స్త్రీలు దేవతా మూర్తులులా ఉంటారే! బిడ్డల కనడం పశుధర్మం. బిడ్డలకు పాలివ్వడం పశుధర్మం, బిడ్డలను రక్షించడం పశుధర్మం, బిడ్డలు పాలు తాగేటంతవరకు ప్రేమించడం పశుధర్మం. కాని అలా పెద్దవారైన బిడ్డలను, తల్లిదండ్రులను, చుట్టాలను? స్నేహితులను ప్రేమించడం? అది మానవధర్మం, దివ్యధర్మం.

అది వర్ణనాతీతం తన పొంకాలైన వక్షోజాలు బిడ్డలకు ఎప్పుడు పాలియ్యగలవు? తెల్లని ఆ అమృతధారలు తన గబుకు గబుకున పుబుక గలదు?

ఆ బిడ్డలతండ్రి, ఆ బిడ్డలు తనగర్భాన మూర్తించడానికి కారణం తన భర్త! జిల్లావైద్యాధికారి! ఒక బ్రాహ్మణుడు. తనకై క్రిందకుదిగినవ్యక్తి! తన్ను చేయిపట్టి మెట్లెక్కించిన దేవతామూర్తి-తన బిడ్డలకు తండ్రికావాలి. తన బిడ్డలు-తన్ను "అమ్మా" అని పిలవరూ! డాక్టరుగారిని "నాన్నా" అని

పిలవరూ! వారు తనకు సర్వనాగరికతలు ధారపోశారు. వారు దేవతామూర్తి. వారు భగవంతుడు. తానెవరు?

ఆ రాత్రి ఆమె సాధారణంగా అలంకరించుకొనే విధానంగా అలంకరించుకోలేదు.

ఆమె సాయంకాలమే తలంటుకొన్నది. నల్లటి తన పొడుగాటి జుట్టు వదులవాల్జడ వేసుకొంది. కనకాంబరాలను తలలో ధరించింది. చెవులదుద్దులు మాత్రం. మెళ్లో పుస్తెల తాడు, ఒక సన్నని బంగారు గొలుసు నుదుట ఇంత కొంకుమబొట్టు, బంగారురంగురవిక, కుసుంబారంగుచీర కుసుంబారంగుగాజులు ధరించింది.

నల్లటి ఆమె మొగాన పౌడరు లేదు. పెదవుల ఎఱుపు రంగు లేదు.

ఆమె రాత్రి వారిద్దరి గదికీ మధ్యనున్న తలుపు తెరువబోయి, అది వేసి ఉండటంవల్ల, వారి గదిలోకి వెళ్ళే ముఖ్య ద్వారం వెంటనే లోపలికి వెళ్ళింది.

ఆ జిల్లా వైద్యాధికారి పురుషుడు. కుంగి సోఫాలో కూర్చుండి చుట్ట కాలుస్తూ ఏదో వైద్యపత్రిక చూస్తున్నారు.

మాచమాంబ తిన్నగా భర్త దగ్గరకు వెళ్ళి సోఫా దగ్గిర భూమిమీద మోకరించి భర్తవొళ్లో తలవుంచింది.

ఆయన తెల్లబోయాడు. ఎవరీమె? ఆ మాలపిల్లా!

ఆమె సంపూర్ణమూర్తిగా, పూర్ణ భార్యగా వచ్చినదన్న ఒక పరమ శ్రుతి ఆయన హృదయంలో మారుమ్రోగింది. ఆయన గడగడలాడి పోయాడు! ఆమె ఎక్కడో ఏదో గ్రామంలో ఊరిచివర ప్రపంచాన్ని తెల్లబోతూ చూస్తూఉన్న అనాధ బాలికయై ఒక దేవునికై, ఒక పరమపవిత్ర నాధునికై, జీవితానికై చేతులు చాచి నిలుచుండిపోయిన బాలికయై ఆయనకు గోచరించింది.

ఆయనలోని పురుషత్వము, మానవత్వము, దివ్యత్వము భర్తృత్వము, జనకత్వం ఒక మహాపుష్పంలోని అన్ని రేకులై విప్పారింది.

ఆతడామెను తన హృదయయానికి గాఢంగా, గాఢంగా, లలితంగా, తమిగా; గౌరవంగా, కామంగా, ప్రేమగా అదుము కొన్నాడు !

6

డాక్టరు మాచమాంబకు పండులాంటి ఆడపిల్ల పుట్టింది. భర్తగారి తల్లి పోలిక అట.

జిల్లా వైద్యాధికారి డాక్టరు సి. పి. రావుగారు నల్లని తన మాల పిల్లలో భారత జాతియొక్క అడుగుమెట్టు చూచినాడు. పైమెట్టు అడుగు మెట్టు ఒకటే. భారతదేశంలో పంట పండవలసిన శాలిభూమి తన భార్య. ఆ నలుపు బంగారానికి రెండవభాయ!

ఆమె హృదయం కోటిబంగారాల విలువ. ఆమె అమృతమూర్తి అయిపోయినది. ఆమె నీలనీరదగాత్ర అయిన పార్వతి! ఆమె ధరిత్రీమాత! ఆమె ప్రపంచాన్ని కరిగించే ప్రేమతో తన సవతి బిడ్డలను హృదయాని కదుముకొన్నది.

తన బిడ్డకు తానే రొమ్ముకుడుపుతూ వైద్యరాజయిన భర్తను బ్రహ్మా నందవీక్షణాలతో చూస్తున్నది.